# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-11-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఢిల్లీలో బాంబు దాడికి పాల్పడిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు.
- ❖ ఢిల్లీలో నిన్న సాయంత్రం జరిగిన పేలుడు ఘటనపై పరిస్థితిని అంచనా వేసేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష సమావేశం నిర్వహించారు.
- ❖ బీహార్ అసెంబ్లీ ఎన్నికల చివరి దశ పోలింగ్ లో దాదాపు 67 శాతానికి పైగా ఓటింగ్ నమోదు అయ్యింది.
- ❖ దేశ ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ బాంబు దాడికి పాల్పడిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలి పెట్టబోమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హెచ్చరించారు. దేశంలోని పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టాయని, దాడికి గల కారణాలను త్వరలో వెల్లడిస్తామని తెలిపారు. భూటాన్ పర్యటనలో ఉన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ దేశ రాజధాని థింపులో ఈరోజు జరిగిన ఓ కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. బాంబు పేలుడుకు కారణమైన బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెట్టి శిక్షిస్తామన్నారు. అమాయకుల ప్రాణాలు తీసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలబోమని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాలకు యావత్ దేశం అండగా నిలుస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

(వాయిస్ 34 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, భూటాన్ దేశాలు శతాబ్దాలుగా ప్రత్యేక సన్నిహిత, సాంస్కృతిక ద్వైపాక్షిక సంబంధాలను కలిగి ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ రోజు ఉదయం భూటాన్ చేరుకుని థింపూలో భూటాన్ రాజు జిగ్మే సింగ్యే వాంగ్చుక్ తో ప్రతినిధి స్థాయి చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య కనెక్టివిటీని పెంచేందుకు చిరకాలంగా ఉన్న భాగస్వామ్యాన్ని పటిష్టపరిచేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. ఇక సాయంత్రం పునత్సంగ్చు జల విద్యుత్ ప్రాజెక్టు రెండవ విడతను భూటాన్ రాజుతో కలిసి ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో నిన్న సాయంత్రం జరిగిన భారీ పేలుడు ఘటన తర్వాత పరిస్థితిని అంచనా వేసేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో ఉన్నత స్థాయి భద్రతా సమీక్ష సమావేశం ఈరోజు జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర హోం కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఢిల్లీ పోలీస్ కమిషనర్, జాతీయ దర్యాప్తు సంస్థ డైరెక్టర్ జనరల్ హాజరయ్యారు. జమ్మూ కాశ్మీర్ పోలీస్ డైరెక్టర్ జనరల్ దృశ్యమాధ్యమ విధానంలో పాల్గొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు బాధ్యతను హోం మంత్రిత్వ శాఖ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కి అప్పగించింది. నగరంలోని అన్ని సున్నితమైన ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేశారు. పేలుడుకు గల కారణాలు పరిస్థితులను గుర్తించడానికి, సాధారణ స్థితిని పునరుద్ధరించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నివారణ) చట్టం (UAPA), పేలుడు పదార్థాల చట్టం, భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక భద్రతా కారణాల దృష్ట్యా లాల్ ఖిలా మెట్రో స్టేషన్ ను గురువారం వరకు మూసివేసినట్లు ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

బీహార్ అసెంబ్లీ ఎన్నికల చివరి దశ పోలింగ్ కొద్ది సేపటి క్రితం ముగిసింది. 20 జిల్లాల పరిధిలోని మొత్తం 122 శాసనసభ స్థానాలకు ఈరోజు పోలింగ్ జరిగింది. పోలింగ్ సమయం ముగిసే సమయానికి దాదాపు 67 శాతానికి పైగా ఓటింగ్ నమోదు అయ్యింది. తొలి విడతలో జరిగిన పోలింగ్‌లో 65.9 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ఇక ఓట్ల లెక్కింపును 14వ తేదీన చేపట్టి అదే రోజున ఫలితాలను వెల్లడిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 22వ సీఐఐ వార్షిక ఆరోగ్య సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఆరోగ్య, జీవిత బీమాలపై గతంలో 18 శాతంగా ఉన్న జీఎస్టీని 0 శాతానికి తగ్గించడంతో దేశ ఆరోగ్య సంరక్షణకు ఎంతో ప్రయోజనం చేకూరిందన్నారు. ముఖ్యంగా వైద్య ఖర్చులు అందరికీ అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆధునిక వైద్యంతో పాటు భారతదేశ సంప్రదాయ వైద్యమైన ఆయుర్వేదం సమగ్ర ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఇవి దేశ ఆరోగ్య రంగాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తున్నాయని పీయూష్ గోయల్ పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీ పేలుడు ఘటనపై దర్యాప్తు సంస్థలు వేగంగా విచారణ జరుపుతున్నాయని.. త్వరలో ప్రమాదానికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఢిల్లీ డిఫెన్స్ డైలాగ్‌లో ఆయన మాట్లాడుతూ... దాడికి కారణమైన వారిని వదిలి పెట్టబోమన్నారు. బాధ్యులను చట్టం ముందు నిలబెడతామని రాజ్‌నాథ్ సింగ్ వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలిలో భారీగా ఆయుధసామగ్రిని స్వాధీనం చేసుకున్నామని జిల్లా ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ వెల్లడించారు. జిల్లాలోని నేషనల్ పార్క్ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలు ఉన్నట్లు సమాచారం అందటంతో బీజాపూర్, దంతెవాడ, డీఆర్‌జీ, ఎస్‌టీఎఫ్ సంయుక్త బృందం ఈ ఆపరేషన్ చేపట్టిందని, ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో ఆటోమేటిక్ ఆయుధాలు ఇన్సాస్, స్టెన్‌గన్‌లు, 303 రైఫిళ్లు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ ప్రాంతంలో ఇంకా మావోయిస్టు కదలికలు ఉన్నట్లు తెలిసిందని, అదనపు బలగాలను అక్కడికి పంపుతున్నామని బస్తర్‌రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, వినియోగం, ఎగుమతిలో భారతదేశాన్ని ప్రపంచ కేంద్రంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర నూతన పునరుత్పాదక ఇంధన శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన 3వ అంతర్జాతీయ గ్రీన్ హైడ్రోజన్ 2025 సదస్సు ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ... నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ కింద బయోమాస్ లేదా వ్యర్థ పదార్థాలను ఉపయోగించి గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసే సాంకేతిక పరిజ్ఞానంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ముందుకు తీసుకెళ్లడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశ్యమని ప్రహ్లాద్ జోషి పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

గిరిజన వారసత్వాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి భాధ్యత అని కేంద్ర స్త్రీ, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన జాతీయ గిరిజన సాహిత్య ఉత్సవం 2025లో ఆమె ప్రసంగిస్తూ... భారతదేశంలోని గిరిజన తెగలు గొప్ప వైవిధ్యమైన చరిత్ర కలిగి ఉన్నాయని, పిల్లలు గిరిజన సంస్కృతి, వారసత్వాన్ని నేర్చుకోవడానికి ఇవి దోహదపడతాయన్నారు. నేడు ప్రజలు సహజమైన, ఆరోగ్యకరమైన, సమతుల్య జీవితాన్ని గడపడానికి నగరాల నుండి గ్రామాలకు తిరిగి వస్తున్నారని సావిత్రి ఠాకూర్ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 83,535 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. చివరికి 336 పాయింట్లు లాభంతో 83,871 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 120 పాయింట్ల లాభంతో 25,694కి చేరింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 88 రూపాయల 57 పైసలుగా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 64 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =